ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 29.5
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

సోమవారం 5 ఆగస్టు 2024

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	576.10 (271.9007)	4,27,711	37,873
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.86 (3.66)	56.93	536.13
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	127.62 (5.90)	25,637	10,267

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.124 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230

నేడు సాగర్ క్రస్ట్ గేట్ల ఎత్తివేత



▸▸ 8 గంటలకు క్రస్ట్‌గేట్లు ఎత్తనున్న ప్రాజెక్టు సీఈ ▸▸ ఆరు గేట్లు ఎత్తి 2లక్షల క్యూసెక్కుల విడుదల ▸▸ అప్రమత్తమైన అన్ని శాఖల అధికారులు

నాగార్జునసాగర్, ఆగస్టు 4: నాగార్జునసాగర్ జలాశయం నిండు కుండలా మారటంతో సోమవారం ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. కృష్ణా బేసిన్‌లో సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండటంతో సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వారం రోజులుగా క్రస్ట్ గేట్ల నుంచి, జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువలో ఉంది. ఎగువ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో భారీ వరద సాగర్‌కు వస్తోంది. దీంతో సోమవారం ఉదయం 8గంటలకు ఆరు క్రస్ట్ గేట్లను ఎత్తి సుమారు 2లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయనున్నట్లు సీఈ నాగేశ్వరరావు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.6070టీఎంసీలు) కాగా, శ్రీశైలానికి ఎగువ నుంచి 4,00,491 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 882.90 అడుగులకు (203.8907 టీఎంసీలుగా) చేరింది. శ్రీశైలం ప్రాజెక్టు 10 క్రస్ట్ గేట్లను 15 అడుగుల మేరకు ఎత్తి, కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ సాగర్‌కు 4,27,711 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా, ఆదివారం సాయంత్రానికి 576.10 అడుగులు (271.9007టీఎంసీలు)గా నమోదైంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 5700 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 4613 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేయడం ద్వారా 26,040 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 37,873 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 4,27,711 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

అన్ని శాఖల అధికారులు అప్రమత్తం: సాగర్ క్రస్ట్ గేట్లను సోమవారం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖ, వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో ఉన్న ప్రజలు ఎవరూ నదిలోకి దిగవద్దని పోలీసులు హెచ్చరించారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖ అధికారులు సూచించారు. దయ్యాలగండి వద్ద సాగర్ బ్యాక్ వాటర్‌లోకి పర్యాటకులు ఎవరు దిగకుండా రోడ్డు వెంట గుంతలు తవ్వించారు. పర్యాటకుల రాక ఎక్కువైతే వాహనాలను కంకర మిల్లు వద్ద ఉన్న బైపాస్ రోడ్డు నుంచి దారి మళ్లించనున్నారు

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్‌కు ఎగువనుంచి భారీగా వరద వస్తుడంతో సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తి స్థాయికి చేరువలో ఉంది. దీంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు ఆదివారం సెలవుదినం కావడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. హిల్‌కాలనీ విజయ విహార్ వెనక ఉన్న లాంచీ స్టేషన్ నుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రెండు లాంచీ ట్రిప్పులను జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు నడిపారు. అంతే కాకుండా సాగర్‌లో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనుపు, ఎత్తిపోతల, బుద్ధవనం, కొత్త వంతెన తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది.

వైజాగ్‌కాలనీని సందర్శించే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

దేవరకొండ: నాగార్జునసాగర్‌కు భారీగా వరద వస్తుండటంతో కృష్ణానది పరివాహక ప్రాంతమైన నేరేడుగొమ్ము మండలం వైజాగ్‌కాలనీలో బ్యాక్ వాటర్ పెరిగింది. ఈ నేపథ్యంలో వైజాగ్‌కాలనీకి వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, సాయంత్రం 5గంటల తరువాత కృష్ణానదిలోకి వెళ్లవద్దని పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేశారు. విహారయాత్రకు వచ్చి ఈతరాకపోవడంతో కృష్ణానదిలో మునిగి ఏటా 10మంది వరకు మృత్యువాత పడుతున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు వైజాగ్‌కాలనీలో సీసీ కెమెరాలు, ప్రమాద హెచ్చరికల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.



సాగర్‌లో కృష్ణానదిలో విహరించి లాంచీ దిగుతున్న పర్యాటకులు

వానొస్తే.. సెల్లార్లే సెలయేర్లు

● ఉమ్మడి జిల్లాలో ఇష్టానుసారంగా సెల్లార్ల నిర్వహణ
● ఇరుకు ప్రదేశంలో వ్యాపారాల నిర్వహణ ● చౌటుప్పల్‌లో నీట మునిగిన సెల్లార్లు
● భువనగిరిలో విద్యుదాఘాతంతో నష్టం ● అయినా చలనం అంతంతే



భువనగిరి పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న సెల్లార్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల్లోని వ్యాపార సముదాయాల్లోని సెల్లార్ల నిర్వహణ ప్రమాదకరంగా తయారైంది. మిర్యాలగూడ, చౌటుప్పల్, భువనగిరి పట్టణాల్లో గత కొన్నేళ్లలో పలు పర్యాయాలు నీటి మునిగి ఆస్తి నష్టంతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ అధికారుల్లో కానీ, భవన యజమానుల్లో కానీ తీరుమారలేదు. ఖాళీగా ఉంచడంతోపాటు పార్కింగ్‌కు కేటాయించాల్సిన స్థలాన్ని వ్యాపార సముదాయాలకు వినియోగిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జనసమూహం సెల్లార్లలో ఉండగా ఏదైనా ప్రమాదం జరిగితే ఇక అంతే సంగతులు. చౌటుప్పల్‌లో ఐదారు పర్యాయాలు నీట మునిగినా అధికారులు వాటిని మూయించలేకపోయారు. ఇదిలా ఉండగా సెల్లార్లలో వ్యాపారాల నిర్వహణతో అక్కడికి వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ఇటు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఎదురవుతోంది.

● సూర్యాపేట టౌన్, హుజూర్‌నగర్

7

ప్రత్యేకాధికారుల పాలన ఇంతేనా ?

● మురికి కూపాలుగా గ్రామాలు ● విజృంభించిన సీజనల్ వ్యాధులతో ప్రజలు బెంబేలు ● వెంటనే పల్లెల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని డిమాండ్

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రత్యేకాధికారులు గ్రామాలను పరిశీలించిన దాఖలాలు కనిపించడంలేదు. దీంతో అన్ని గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. వరుసగా కురుస్తున్న వర్షాలతో అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

● *కోదాడ రూరల్*



పూడిక తీయకపోవడంతో కాపుగల్లులో కాల్వలో నిలిచిన మురుగునీరు

అపరిశుభ్రత కారణంగా రెండు వారాల క్రితం మునగాల మండలం తాడ్వాయి గ్రామంలో పలువురు అతిసార వ్యాధి బారినపడ్డారు. దీంతో అక్కడి వైద్యశాఖ అధికారులు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేశారు. నడిగూడెం మండలంలో కలెక్టర్ ఇటీవల పర్యటించి జ్వరాలతో బాధపడుతున్న తెల్లబల్లి, రామాపురం, ఎస్కలాన్‌పేట గ్రామాల్లో పారిశుధ్య చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జ్వర బాధితులను మెరుగైన వైద్యం కోసం సమీపంలోని వైద్యశాలకు తరలించాలని ఆదేశించారు. అనంతగిరి మండలంలో కూడా పారిశుధ్యం లోపించడంతో గ్రామాల్లో పరిస్థితి దయనీయంగా మారింది. అనంతగిరి మండలం వెంకట్రాంపురం గ్రామంలో రెండు వారాల క్రితం డెంగీ జ్వరంతో సాయితేజ అనే యువతి మరణించింది. వెంకట్రాంపురం, ఖానాపురం, అమీనాబాద్, గోల్‌తండా గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో కోదాడలోని ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతు న్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోదాడ మండలంలోని కాపుగల్లు, గుడిబండ, మంగళితండా, రెడ్లకుంట, చిమిర్యాల, దోరకుంట, యర్రవరం, గణపవరం గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. రోడ్డుపైనే మురుగునీరు నీరు ఉండటంతో పాటు ఇళ్ల మధ్య నిలిచింది. గుడిబండలోని 3వ వార్డులో ఓ వీధిలోని రోడ్డు మొత్తం మురుగునీటి నిండింది. ఈ విషయంపై ఆ గ్రామా కార్యదర్శికి సమాచారం ఇచ్చినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆ గ్రామస్థులు తెలిపారు. కాపుగల్లు గ్రామంలోని 6వ వార్డులో ఇళ్ల మధ్య ఉన్న మురుగునీరు నిల్వ ఉన్నందున దుర్వాసన వస్తోందని, దోమల బెడద అధికమైందని ఆ గ్రామస్థులు తెలిపారు. వర్షాలతో యర్రవరం గ్రామంలోని వీధులు బురదమయంగా మారాయని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు కూడా సక్రమంగా రావడం లేదని ఆయా గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌ల పాలన ముగిసి ప్రత్యేకాధికారుల పాలన వచ్చినప్పటి నుంచి కార్యదర్శులు అందుబాటులో లేరని ప్రజలు ఆరోపించారు. ఒక వేళ కార్యదర్శులు గ్రామాలకు వచ్చినా ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళుతున్నారో తెలియడంలేదంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

కలెక్టర్ సమావేశం నిర్వహించినా..

కోదాడ డివిజన్ పరిధిలో మునగాల, కోదాడ, నడిగూడెం, అనంతగిరి, చిలుకూరు మండలాల ప్రత్యేకాధికారులతో కలెక్టర్ ఇటీవల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, వర్షాలు కురుస్తున్నందున ఇళ్ల మధ్యలో, వీధుల వెంట మురుగునీరు లేకుండా చూడాలని, పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, మురుగునీరు బయటికి పంపేందుకు ప్రత్యేక కాల్వలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అయినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పురాలేదని ఆయా గ్రామస్థులు తెలిపారు.



బురదమయంగా ఉన్న గుడిబండ 3వ వార్డు

మురుగుకాల్వల్లో పూడిక తీయడం లేదు



కాపుగల్లు గ్రామంలోని మూడో వార్డులోని మురుగుకాల్వలో పూడిక తీయలేదు. దీంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ సిబ్బందికి తెలిపినా పట్టించుకోవంలేదు.

● కాసాని వెంకటేశ్వర్లు, కాపుగల్లు

పంట చేలో కృష్ణమ్మ పరవళ్లు

● నేరేడుచర్లకు చేరిన సాగునీరు



నేరేడుచర్ల మండలంలోని జాన్‌పహాడ్ మేజర్‌లో ప్రవహిస్తున్న సాగర్ నీరు

నేరేడుచర్ల, ఆగస్టు 4: నేరేడుచర్ల మండలానికి సాగర్ నీరు చేరింది. సరైన వర్షాలు లేక సాగు కష్టం అనుకున్న నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల రైతాంగానికి సాగర్(సాగు)నీరు రావడంతో ఎంతో ఆనందంగా ఉన్నారు. ఈసారి కరువు తప్పదనుకున్న రైతాంగానికి ఎగువన వర్షాలు కురవడం, అన్ని డ్యాంలు సమృద్ధిగా నిండి సాగర్ జలాశయం నిండడంతో ఈసారి రెండు పంటలకు నీరు వస్తుందన్న ఆశ రైతాంగంలో ఏర్పడింది. సాగర్ ఎడమకాల్వకు మంత్రులు ఈ నెల 2న నీటిని విడుదల చేయడంతో సాగర్ ఎడమకాల్వ నుంచి జాన్‌పహాడ్ మేజర్‌కు నీటిని విడుదల చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఈ నీరు మూడు మండలాల పరిధిలోని పలు మేజర్ల ద్వారా సాగు భూముల్లోకి పరుగులు తీస్తున్నాయి. భూగర్భజలాలు తగ్గిపోయి, తాగునీరు కూడా ఇబ్బందిగా ఉన్న తరుణంలో ఇప్పుడు సాగర్ నీరు రావడంతో చెరువులు నిండడంతోపాటు గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగే అవకాశముంది. మొత్తం ఖరీఫ్, రబీ సీజన్లకు పూర్తిస్థాయిలో నీరు వస్తుందన్న ఆశ రైతాంగానికి ఏర్పడింది. ఇప్పటికే బోర్లు, బావుల కింద నార్లు పోసుకున్న రైతులు కొందరు వరినాట్లు వేసుకోగా, ఇప్పుడు వేగంగా నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. డ్రమ్‌సీడ్ ద్వారా, విత్తనాలు చల్లడం ద్వారా కొందరు రైతులు మొదలు పెడుతుండగా, కూలీల ద్వారా నార్లు పోసుకున్న రైతులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే కరిగట్లు చేసుకుని నాటుకు సిద్ధంగా ఉన్నారు. రెండు కార్లు నీటికి కొదవ లేక పోవడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులపైనే ప్రభుత్వం దృష్టి

● ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ● నేడు కోదాడకు మంత్రి ఉత్తమ్ రాక ● ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్య, వైద్యం, విద్యుత్ సమస్యలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

కోదాడ, ఆగస్టు 4: అభివృద్ధి పనులపైనే కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించిందని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా, తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. అదేవిధంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హల్‌లో సోమవారం మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6:30 వరకు లిఫ్ట్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, విద్య, వైద్యం, విద్యుత్ సమస్యలపై సంబంధితశాఖ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బాలాజీనగర్‌లోని శ్మశానవాటికలో మార్తి లక్ష్మీనర్సయ్య జ్ఞాపకార్థం రూ.8లక్షలతో నిర్మిస్తున్న కోల్డ్‌ఛాంబర్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏర్నేని బాబు, వేమూరి విద్యాసాగర్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఎస్.ప్రమీల, వైస్ ఛైర్మన్ కందుల కోటేశ్వరరావు, వైద్యులు సుబ్బారావు, రామారావు, కౌన్సిలర్ స్వామినాయక్, రమణనాయక్, రాజు, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, బాగ్ధాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.232కోట్లతో రహదారుల విస్తరణ పనులు

కోదాడ, హుజుర్‌నగర్ నియోజకవర్గాల్లో రూ.232కోట్లతో రహదారుల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి తెలిపారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు నియోజకవర్గాల్లో రహదారుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఫలితంగా నియోజకవర్గాల ప్రజలతో పాటు, ఏపీ తెలంగాణ ప్రజల ప్రయాణాలు సులభం కానున్నాయని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ

కోదాడటౌన్: కాంగ్రెస్ పేదల పార్టీ అని కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ సాయిగౌడ్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని బక్కమంతులగూడెం సమీపంలోని ఎర్రగట్టుతండా వెళ్లే రహదారిలో నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి నేడు నీటిపారుదల, పౌర సరఫరా శాఖల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భూమి పూజ చేయన్నుట్లు పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజునాయక్, సీనియర్‌నేత ఆదూరి కిషోర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

విద్య, వైద్యం
ప్రభుత్వ బాధ్యత

● పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.మంగ



సమావేశంలో మాట్లాడుతున్న మంగ

కోదాడటౌన్, ఆగస్టు 4: పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని పౌరస్పందన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే.మంగ అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో పౌరస్పందన వేదిక కోదాడ డివిజన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలలు, వైద్యశాలల్లో ఉన్న సమస్యలను పౌరస్పందన వేదిక సర్వేచేసి ప్రభుత్వానికి నివేదిక అందించిందన్నారు. ప్రభుత్వ విద్య, వైద్యరంగాన్ని కాపాడుకోవాలనుకునే వారు పౌరస్పందన వేదికలో ఎవరైనా సభ్యులుగా చేరవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలు నిలబడాలని, చదువుల్లో అంతరాలు తగ్గించాలన్నారు. జిల్లా అధ్యక్షులు ఆర్.ధనమూర్తి అధ్యక్షతన పౌరస్పందన వేదిక కోదాడ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా ఎస్బీఐ బ్యాంక్ రిటైర్డు మేనేజర్ వి.వెంకటరమణ, ఉపాధ్యాక్షులుగా డి.పద్మావతి, నాగుల పాషా ఎన్నికయ్యారు. సమావేశంలో అంకతి మల్లికార్జున్, వెంకటనారాయణ, నరసింహారావు పాల్గొన్నారు.

కోదాడ తహసీల్దార్‌కు షోకాజ్ ?

కోదాడ రూరల్, ఆగస్టు 4: కోదాడ తహసీల్దార్ సాయిగౌడ్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిసింది. కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్ వెంకయ్య భూముల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన రైతునుంచి రూ.30వేలు డిమాండ్ చేయడంతో ఆ రైతు కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. వెంటనే విచారించిన అధికారులు ధరణి ఆపరేటర్ వెంకయ్యను తొలగించారు. దీంతో వెంకయ్య తహసీల్దార్‌పై పలు ఆరోపణలు చేస్తూ మూడు పేజీల లెటర్‌ను కలెక్టర్‌కు పంపారు. దీనిపై తహసీల్దార్‌ను వారం రోజుల్లో ఎందుకు సస్పెండ్ చేయకూడదో వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి : మల్లు

సూర్యాపేట, ఆగస్టు 4: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా నిధులను వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మల్లు వెంకటనరసింహారెడ్డి భవన్‌లో జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.1,50,000కోట్లు మాత్రమే కేటాయించడంతో దేశ రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లనుందన్నారు. బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ రంగానికి 25శాతం కేటాయించాలని డిమాండ్‌చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కనీస మద్దతు ధరలకు చట్టం చేయాలని, దేశ రైతాంగానికి ఉన్న అప్పులను కేంద్రప్రభుత్వం మాఫీ చేయాలన్నారు. 55 ఏళ్లు దాటిన రైతులందరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో దండా వెంకటరెడ్డి, కొప్పుల రజిత, కందాళ శంకర్‌రెడ్డి, దేవరం వెంకటరెడ్డి, షేక్ సైదా, సత్యనారాయణ రెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

యాదగిరికొండపై భక్తుల రద్దీ

ప్రత్యేక, ధర్మదర్శనాల్లో భక్తుల సందడి ● యాదగిరిగుట్ట ఆలయ ఈఈ సస్పెన్షన్





నిత్య కల్యాణంలో భాగంగా హోమం నిర్వహిస్తున్న అర్చకులు, యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట తిరువీధుల్లో భక్తుల సందడి

భువనగిరి అర్బన్, ఆగస్టు 4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆదివారం యాదగిరికొండపై రద్దీ నెలకొంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వాహనాలపై తరలివచ్చారు. సుమారు 20వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీగా కన్పించాయి. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద భక్తుల రద్దీ ఉండగా ఆలయ ఉత్తర దిశలో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. అదే విధంగా భక్తులను కొండపైకి తరలించేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లుచేశారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.27,09,469 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో శ్రీ పర్వతవర్థిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు.

7వ తేదీన హుండీ కానుకల లెక్కింపు

లక్ష్మీనృసింహుడిని దర్శించుకునే భక్తులు సమర్పించే మొక్కు కానుకలను ఈ నెల 7వ తేదీన కొండకింద సత్యదేవుని వ్రత మండపంలో లెక్కించనున్నట్లు ఈవో భాస్కరరావు తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయ ఈఈ రామారావు సస్పెన్షన్

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో ఎలక్ట్రికల్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న ఊడెపు వెంకటరామారావు ఆదివారం సస్పెండ్ అయ్యారు. ఆలయంలో ఈఎస్ఎం శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఎలాంటి అనుమతులు లేకుండా 12మందిని నియమించారు. గతంలో వచ్చిన ఆరోపణలు, స్థానికంగా పలు ఫిర్యాదులు రావటంతో విచారణ చేపట్టిన ఈవో సస్పెండ్ చేశారు. ఈమేరకు సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డికి అదనంగా ఎలక్ట్రికల్ ఈఈగా బాధ్యతలు అప్పగించారు.

వానొస్తే.. సెల్లార్లే సెలయేర్లు

దేశ రాజధాని ఢిల్లీలో సెల్లార్‌లోకి వరదనీరు చేరి సివిల్స్‌కు శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంతో సెల్లార్ల వ్యవహారం అంతటా చర్చనీయాంశమైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునిసిపాలిటీల్లో నిబంధనలకు వ్యతిరేకంగా, అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని సెల్లార్లను వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. వాహనాల పార్కింగ్ పేరిట నిర్మించిన సెల్లార్లను వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. వర్షం వచ్చిందంటే నీరు చేరి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. అదేవిధంగా ఆరుబయట రహదారిపై వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో భారీ వర్షాలకు భువనగిరి పట్టణంలో నష్టం వాటిల్లినా వ్యాపారుల్లో, అధికారుల్లో మార్పు రాలేదు.

- వర్షం వచ్చిందంటే వరద నీరు చేరాల్సిందే
- పార్కింగ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- చూసీ చూడనట్లుగా వదిలేస్తున్న అధికారులు
- అనుమతులు కొంత.. నిర్మాణాలు కొండంత


యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 2021లో సర్వీస్ రోడ్డులో ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్ ఫొటో)

● ప్రమాదం చోటుచేసుకున్నా మారలే..

భువనగిరి టౌన్, ఆగస్టు 4 : వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్న సెల్లార్లు భువనగిరి మునిసిపల్ పరిధిలో 20కి పైగా ఉండగా రెండింటికి మాత్రమే నిర్మాణ అనుమతులు ఉన్నాయి. మిగతావన్నీ అక్రమ నిర్మాణాలుగా ప్రజలు ఆరోపిస్తున్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు సెల్లార్లలోకి వరద నీరు చేరి అద్దెకుంటున్న వ్యాపారులకు రూ.లక్షల్లో నష్టం జరిగింది. కొన్ని సెల్లార్లలో వర్షపునీటి కారణంగా విద్యుదాఘాతం కూడా సంభవించింది. దీంతో చర్యల పేరిట అధికారులు భవన యజమానులకు నోటీసులు జారీ చేశారు. కాని నేటికీ సెల్లార్లలో ఎలాంటి మార్పులు రాకపోగా నూతనంగా నిర్మించిన సెల్లార్లు కూడా వ్యాపారాలకు అడ్డాగా మారాయి. సెల్లార్లలో నిర్వహించే వ్యాపారాల కోసం వచ్చే వారి వాహనాల పార్కింగ్‌తో కూడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో పాటు మునిసిపాలిటీకి ఆస్తిపన్ను, ట్రేడ్ పన్ను తదితర రూపకాల్లో నష్టం వాటిల్లుతోంది.

సెల్లార్లలో ఆసుపత్రి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ మెయిన్‌రోడ్డులోని సెల్లార్లలో ఆసుపత్రులు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వర్షం వస్తే ఒక్కోసారి వరద నీరు సెల్లార్లలోకి వరద చేరే ప్రమాదం ఉంది. అయినా సెంటర్‌లోని సెల్లార్‌లో ఆసుపత్రిని ఏర్పాటుచేశారు. లింగగిరి రోడ్డులో ఎంటర్‌ప్రైజెస్, మెటల్ షాప్, మిర్యాలగూడ రోడ్డులోని సెల్లార్‌లో సెల్ షాప్, కొత్తబస్టాండ్ సమీపంలోని మరో రెండుసెల్లార్లలో మెకానిక్ షాపులు, మోటార్ షోరూంలు నిర్వహిస్తున్నారు. మొత్తంగా ఏడు దుకాణాలను సెల్లార్లలో నిర్వహిస్తున్నారు. గతంలో సెల్లార్లలోని వరద నీరు వచ్చి చేరింది.

● కాగితాల్లో ఒకలా.. క్షేత్రస్థాయిలో మరోలా

రామగిరి: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో పెద్దసంఖ్యలో అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వీటిలో సెట్‌బ్యాక్, ఫైర్‌వాహనం చుట్టూ తిరిగేలా స్థలం కేటాయించాల్సి ఉన్నా ఆ నిబంధనలకు నీళ్లొదిలి ఇష్టానుసారంగా నిర్మించారు. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. కాగితాల్లో నిబంధనలు పాటిస్తున్నట్లు ఉన్నా, క్షేత్రస్థాయిలో అవేవీ కనిపించవు. పట్టణంలో సుమారు 500కు పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటిలోని సెల్లార్ స్థలాన్ని కేవలం పార్కింగ్‌కి మాత్రమే ఉపయోగించాల్సి ఉండగా కొన్నిచోట్ల లైబ్రరీలు,ఫంక్షన్‌హాల్స్, ఆఫీసరూంలు నిర్వహిస్తున్నారు. ప్రకాశంబజార్‌లోని కొన్నింటిలో ఆసుపత్రులు, ల్యాబ్‌లను ఏర్పాటుచేశారు. ఆసుపత్రులకు వచ్చే వారి వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. సెల్లార్‌లో వాహనం పెట్టే అవకాశం లేక రోడ్డుకు ఇరువైపులా పెట్టిన వాహనయజమానులకు పోలీసులు జరిమానా విధించిన సంఘటనలూ ఉన్నాయి. రెండేళ్ల కిందటి వరదలకు సెల్లార్లలోకి వరదనీరు చేరి అపార్ట్‌మెంట్ వాసులు మూడు రోజుల పాటు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా వరద నీటిని మోటార్లతో ఎత్తిపోయాల్సిన పరిస్థితి నెలకొంది. సెల్లార్‌లో వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.

నోటీసులు ఇస్తాం

సెల్లార్‌ను పార్కింగ్, జనరేటర్ ఏర్పాటుకోసం ఉపయోగించాలి. వ్యాపారాలు కాదు. అపార్ట్‌మెంట్లలోని సెల్లార్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు ఇస్తాం. అప్పటికీ స్పందించకపోతే చట్టరీత్యా చర్య తీసుకుంటాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, కమిషనర్, నల్లగొండ



అమలుకాని నిబంధనలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణం వేగంగా విస్తరిస్తుండగా 48 వార్డుల్లో గృహాలతో పాటు వ్యాపారసముదాయాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణ జనాభా లక్షన్నరకు చేరుకోగా సుమారు 26వేలకు పైగా నిర్మాణాలున్నాయి. 2,207 గృహేతర భవనాలు, 1,592 మిశ్రమ భవనాలున్నట్లు అధికారులు తెలిపారు. అయితే మునిసిపల్ నిబంధనలు ఎక్కడా అమలు కావట్లేదు. భవన నిర్మాణాల అనుమతులు కాగితాలలో చూపేది ఒకటైతే క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరోరకంగా ఉంటున్నాయి. ప్రధానంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లలోని సెల్లార్లను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారు. సాగర్‌రోడ్‌లోని హనుమాన్‌పేట, రెడ్డీకాలనీ, నల్లగొండ రోడ్డులోని రాంచంద్రాగూడెం, రౌండ్‌చౌరస్తా, సీతారాంపురం, గుంటూరు రోడ్డులోని విద్యానగర్, హౌసింగ్‌బోర్డులలో నిర్మించిన బహుళ అంతస్తుల వ్యాపార సముదాయాల్లో నిబంధనలు పాటించిన నిర్మాణాలు ఒకటి, అర మాత్రమే. హనుమాన్‌పేట ప్రాంతంలో మురుగుకాల్వలను ఆక్రమించి కట్టిన దుకాణ సముదాయాల్లోని సెల్లార్లు వర్షాకాలంలో జలపాతాలను తలపిస్తుండగా, నల్లగొండ రోడ్డులోని సెల్లార్లు బావులను తలపిస్తున్నాయి. ఏడెనిమిదేళ్ల క్రితం రాజీవ్ చౌరస్తాలోని సెల్లార్‌లోకి వరద నీరు చేరితే మోటార్లతో నీటిని తోడేశారు. ఇక మూడేళ్ల క్రితం హనుమాన్‌పేటలోని షాపింగ్ కాంప్లెక్స్‌లోకి భారీగా వరద నీరు చేరగా వ్యాపారులకు నష్టం వాటిల్లింది.

● చౌటుప్పల్‌లో తలాపునే ప్రమాదం

చౌటుప్పల్ టౌన్: చౌటుప్పల్ పట్టణంలోని చెరువు కింది ప్రాంతాల్లోని సెల్లార్లు ప్రమాదకరంగా మారాయి. రెండు, మూడేళ్లలో ఐదు పర్యాయాలుగా వచ్చిన వరదలతో పాటు చెరువు అలుగు నీరు అనేక సెల్లార్లలోకి చేరి యజమానులు తీవ్రఇబ్బందులను ఎదుర్కొన్నారు. పట్టణంలో పైభాగంలో ఉన్న చెరువు నుంచి ఊట జలాలు సెల్లార్లలోకి రావడంతో యజమానులు అష్టకష్టాలు పడ్డారు. అనేక కుటుంబాలు ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాయి. సెల్లార్లలో నీరు నెలల తరబడి నిలిచి యజమానులకు తీవ్రనష్టాలను కలిగించింది. సెల్లార్లలోని నీటిని తోడేందుకు అగ్నిమాపక వాహనాలను ఉపయోగించారు. వరద తగ్గిన తర్వాత కూడా ఐదారు నెలల పాటు సెల్లార్లలో ఊట నీరు చేరింది. వాటిని మోటార్లసాయంతో బయటకు పంపించారు.

రహదారికి ఇరువైపులా

చౌటుప్పల్‌లో ప్లాట్ల ధరలు పెరగడంతో యజమానులు అండర్ గ్రౌండ్(సెల్లార్) నిర్మాణాలపై దృష్టి సారించారు. జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లతో పాటు తంగడపల్లి రోడ్డు, లింగారెడ్డిగూడెం రోడ్డు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ రోడ్డు, హ్యాండ్లూమ్ మార్కెట్ రోడ్డు, చిన్నకొండూరు రోడ్డులలో సెల్లార్ నిర్మాణాలు చేపట్టారు. ఆయా రోడ్లలో 156మడిగెలకు అండర్ గ్రౌండ్ నిర్మాణాలు ఉండగా, వీటిలో 10కి పైగా నివాసగృహాలు ఉన్నాయి. రెండు పేరొందిన కమర్షియల్ కాంప్లెక్స్‌లో సెల్లార్లను పార్కింగ్‌కు కేటాయించగా, ఓ సొంత భవనంలోని సెల్లార్‌లో ఓ పార్టీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.

● అత్యధికంగా అనుమతుల్లేనివే?

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణ పరిధిలో సెల్లార్ల నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అత్యధికంగా అనుమతుల్లేకుండా ఏర్పాటు చేయడంతో పాటు అందులో చిరువ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. కనీస జాగ్రత్తలు పాటించడంలేదు. ఇంత జరుగుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. సూర్యాపేట పరిధిలో 48వార్డులు ఉండగా 37,500 గృహాలు ఉన్నాయి. ముఖ్యంగా కుడకుడ ప్రాంతంలో, వాణిజ్యభవన్, ఎంజీ రోడ్డు, తాళ్లగడ్డ, అయ్యప్పనగర్, కలెక్టరేట్ ప్రాంతంతో పాటు వివిధ రకాల వ్యాపార సముదాయాల ప్రాంతంలో నూతన భవనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సెల్లార్లు ఉన్న భవనాలు 110కి పైగా అనుమతులు తీసుకోకుండా నిర్మించినవే ఉన్నాయి. ఇటీవల జాతీయ రహదారి వెంట నూతనంగా 10కి పైగా ప్రముఖ వస్త్ర, వ్యాపార షాపింగ్‌మాల్ నెలకొల్పారు. వీటికి సెల్లార్లు ఉన్నాయి. వీటిల్లో కొన్ని పార్కింగ్‌కు వినియోగిస్తున్నా కొన్ని మాత్రం పార్కింగ్‌తో పాటు వ్యాపార అవసరాలకు వాడుకుంటున్నారు.

దేవరకొండ : దేవరకొండ మునిసిపాలిటీలోని కొన్ని షాపింగ్ కాంప్లెక్స్‌ల సెల్లార్లలో నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తున్నారు. పట్టణ పరిధిలో 20 వార్డులు ఉండగా 55వేల జనాభా నివసిస్తోంది. 952 వాణిజ్య దుకాణాల సముదాయాలు ఉండగా ఐదు సెల్లార్లు ఉన్నాయి. సెల్లార్లలో కారు పార్కింగ్, వాహనాలు నిలుపుకోవడంతో పాటు దుకాణాలు ఏర్పాటుచేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు. సెల్లార్లలో ప్రమాదాలు జరిగితే ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. సెల్లార్లలో అగ్నిమాపక వాహనం తిరిగేలా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

రైలుకు ఎదురువెళ్లి విద్యార్థి బలవన్మరణం


బొల్లెద్దు చందు (ఫైల్ ఫొటో)

నల్లగొండ క్రైం, ఆగస్టు 4: వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగా వెళ్లి ఓ డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం శేషమ్మగూడెం గ్రామానికి చెందిన బొల్లెద్దు నగేశ్-సరస్వతి దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు భాను ఇటీవల డిగ్రీ పూర్తి చేయగా, చిన్న కుమారుడు బొల్లెద్దు చందు (20) నల్లగొండ ఎన్జీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. పార్ట్ టైమ్‌గా పనిచేసే ఆఫీసుకు వెళ్తున్నానని శనివారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిన చందు రాత్రి అయినా రాకపోవడం, ఫోన్ ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులను ఆరాతీయగా ఆచూకీ లభించలేదు. ఆదివారం తెల్లవారుజామున దుప్పలపల్లి బైపాస్ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఛిద్రమైన మృతదేహంతో పాటు అక్కడున్న వస్తువులను స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ద్విచక్రవాహనంతో పాటు సెల్‌ఫోన్ ఆధారంగా చందు మృతదేహంగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శనివారం అర్ధరాత్రి సమయంలో రైల్వేట్రాక్ వద్దకు వచ్చిన చందు తన ద్విచక్ర వాహనాన్ని సమీపంలో నిలిపి వేగంగా వస్తున్న రైలుకు ఎదురుగావెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. రైలు ఢీకొనడంతో మృతదేహం ఛిద్రంకాగా, నల్లగొండ జిల్లా కేంద్రాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. రాయినిగూడెం రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రైల్వే ఎస్‌ఐ సాలకమ్మ తెలిపారు. చందు ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ ముమ్మరం చేశారు.

ఎదిగివచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అశ్రునయనాల నడుమ చందు అంత్యక్రియలు నిర్వహించారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


గట్టుప్పల్‌లో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు వర్షిత్‌రెడ్డి, శ్రీనివాస్

గట్టుప్పల్, ఆగస్టు 4 : చేనేత కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ వర్కాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు అలె భాస్కర్‌రాజ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. కష్టకాలంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికులకు రుణ సహాయాన్ని అందించాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చా సుధాకర్‌రావు, ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, నల్లగొండ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, చేనేత సెల్ రాష్ట్ర మాజీ కన్వీనర్ ఎన్నం శివకుమార్, కోమటి వీరేశం, రాపోలు గోపీనాథ్, చిలువేరు దుర్గయ్య, రావుల ఎల్లప్ప, నరేందర్, నామని దత్తత్రి, కొంగరి పాండు, రాపోలు మారుకొండయ్య, తిరం దాసు చంద్రమౌళి, జంగయ్య, ఆంజనేయులు, కర్నాటి ప్రవీణ్, శంకర్, వెంకటేశం, కర్నాటి రవితేజ, శ్రీకాంత్, శివశంకర్, బీజేపీ, యువ మోర్చా నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల డీపీఆర్‌ను ఆమోదించాలి


సదస్సు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, సీపీఎం నాయకులు

మర్రిగూడ, ఆగస్టు 4 : డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పనులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఈ నెల 9న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక ఫ్లోరిన్ ఈ ప్రాంతంలోనే ఉందని, దీంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. సాగునీరు లేకపోవడంతో భూములు బీళ్లుగా మారాయన్నారు. ప్రాజెక్టు పూర్తి కోసం సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఇటీవల సీపీఎం ఆధ్వర్యంలో ప్రాజెక్టుల పరిశీలన చేశామని, ఈ నెల 9న నల్లగొండ జిల్లాకేంద్రంలో జరిగే సదస్సుకు పెద్దఎత్తున ప్రజలు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, బండ శ్రీశైలం, మర్రిగూడ మండల కార్యదర్శి వేర్పుల యాదయ్య, నాంపల్లి మండల కార్యదర్శి చంద్రమౌళి, సీపీఎం నాయకులు బొట్టు శివకుమార్, ఖైల సత్తయ్య, కొమ్ము లక్ష్మయ్య, నీలకంఠ రాములు, కొట్టం యాదయ్య, దామెర లక్ష్మి, మల్లెటి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని కోరుతూ ఈ నెల 9న నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. సమావేశంలో చింతపల్లి మండల కార్యదర్శి ఉడుగుండ్ల రాములు, ఎల్లయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు


కాంస్య పతకాలతో విద్యార్థులు

చండూరు, ఆగస్టు 4 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఆదివారం నకిరేకల్ పట్టణంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 38వ షాటోఖాన్ జాతీయ పోటీల్లో చండూరుకు చెందిన 10 ఏళ్ల లోపు విద్యార్థులు కాంస్య పతకాలు గెలుపొందారు. గీతా విద్యాలయానికి చెందిన సంకోజు సాయిప్రణయ్, సంకోజు మణిదీప్, కారింగు అభిరామ్, కృష్ణవేణి విద్యాలయానికి చెందిన ఇరిగి భానుతేజలు ఈ పతకాలు సాధించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే వేముల వీరేశం మెడల్స్‌ను అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన మాస్టర్ కాంరింగు రవికి ఎమ్మెల్యే మెమోంటో అందజేసి, అభినందించారు. విద్యార్థులు పతకాలు సాధించడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాస్టర్స్ రాపోలు సుదర్శన్, అంతటి సోములుగౌడ్, నగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

మఠంపల్లి, ఆగస్టు 4 : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మం డలం మట్టపల్లిలోని లక్ష్మీనృసింహుని క్షేత్రంలో స్వామి వారి నిత్యకల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకుముందు మూలవర్యులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం ఆరెపత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమలు చేపట్టారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. అనంతరం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహర్నివేదనలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు : ఒకరి మృతి

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 4 : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. సీఐ అశోక్ రెడ్డి ఆదివారం తెలిపిన వివరాలు ప్రకారం ఖమ్మం జిల్లా వైరా నుంచి పదిమల వీరభద్రరావు(68) ఆయన కుమారుడు జగదీష్, బంధువు నితీష్‌కుమార్ కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. లింగోజిగూడెం వద్దకు రాగానే కారు ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో పదిమల వీరభద్రరావు మృతి చెందగా, జగదీష్, నితీష్‌కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, డీసీఎం ఢీ

- డ్రైవర్లకు తీవ్రగాయాలు
- క్యాబిన్‌లో ఇరుక్కున్న డీసీఎం డ్రైవర్
- అతికష్టం మీద బయటికి లాగిన పోలీసులు


దెబ్బతిన్న వాహనాలు, రాకపోకలను పునరుద్ధరిస్తున్న పోలీసులు

కనగల్, ఆగస్టు 4 : నల్లగొండ జిల్లా కనగల్ మండం జీ చెన్నారం సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు డీసీఎం ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరు వాహనాల డ్రైవర్లు తీవ్రగాయాల పాలయ్యారు. కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోగా, గంట పాటు శ్రమించి డీసీఎం డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ నుంచి చండూరుకు నైట్‌హాల్ట్ బస్సు కనగల్ మీదుగా వెళుతోంది. మండలంలోని నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై జీచెన్నారం స్టేజీ సమీపంలో ఎదురుగా నల్లగొండకు వైపు వస్తున్న డీసీఎం ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో వాహనాల ముందుభాగాలు నుజ్జునుజ్జు కాగా ఇరువురు డ్రైవర్లు క్యాబిన్లలో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బస్సు డ్రైవర్‌ను త్వరగానే బయటికి లాగి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటిలోగా ఎస్‌ఐ విష్ణుమూర్తి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీసీఎం క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను గంటపాటు కష్టపడి బయటకు తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలించారు. అంతసేపు రక్తమోడుతూ డ్రైవర్లు నరకయాతన అనుభవించారు. బస్సు డ్రైవర్ కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చెందిన ఎరుకల బిక్షంగా గుర్తించారు. ఇదిలా ఉండగా బస్సులోని నలుగురికి ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. వారు కూడా 108 వాహనంలో నల్లగొండలోని ఆసుపత్రికి వెళ్లారు. మిగతా ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో చండూరుకు వెళ్లారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేని ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు.

రూ.88 వేలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

మోత్కూరు, ఆగస్టు 4 : సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా పలువురు సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకుంటూనే ఉన్నారు. క్రెడిట్ కార్డుదారుడి నుంచి రూ.88 వేలు కొల్లగొట్టిన సంఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో వెలుగులోకి వచ్చింది. మోత్కూరుకు చెందిన వ్యాపారి క్రెడిట్‌కార్డ్ ఉపయోగిస్తున్నాడు. అతడికి ఇటీవల పలు మెస్సేజీలు రాగా వాటికి సమాధానం ఇచ్చాడు. గత నెల(జూలై) 15కు ముందు ఒకసారి రూ.40 వేలు, ఆ తర్వాత 15న మరోసారి రూ.48 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. అది గమనించని సదరు వ్యాపారి తన క్రెడిట్ కార్డ్ సక్రమంగా పనిచేయడం లేదంటూ మూడు రోజుల క్రితం క్రెడిట్‌కార్డులు ఇచ్చే వ్యక్తికి చూపించాడు. అతడు కార్డు ద్వారా రూ.88 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారని ఆ వ్యాపారికి చెప్పి, ఆ కార్డు బ్లాక్ చేసి కొత్త కార్డు ఇచ్చాడు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

స్నేహితుడిపై దాడిని అడ్డుకోబోయి గాయాలు

హుజూర్‌నగర్, ఆగస్టు 4 : స్నేహితుడిపై కత్తితో దాడిని అడ్డుకోబోయిన ఓ వ్యక్తి గాయాలపాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూరుగడ్డ గ్రామానికి చెందిన చింతా నవీన్, నేరేడుచర్లకు చెందిన యడవెల్లి వరుణ్‌కు పాతకక్షలు ఉన్నాయి. మధ్యాహ్నం పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఇందిరాసెంటర్‌లో ఉన్న రమ్మని నవీన్‌కు వరుణ్ ఫోన్ చేశాడు. తన స్నేహితులతో నవీన్ అక్కడికి వెళ్లగా వరుణ్ తన బైక్‌తో ఢీకొట్టి వెంట తెచ్చుకున్న కత్తితో నవీన్‌పై దాడి చేశాడు. అడ్డుకోబోయిన గోపాలదాసు కిరణ్‌ను కూడా దాడిచేసి గాయపర్చాడు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దాడిలో గాయపడ్డ నవీన్, కిరణ్‌లు స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.

'పెరిక కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలి'

కోదాడ టౌన్, ఆగస్టు 4: పెరిక కులస్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు జుట్టుకొండ బసవయ్య అన్నారు. ఆదివారం కోదాడలోని పెరిక సంఘం భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిక కులస్థులు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలన్నారు. పెరిక హాస్టల్, పెరిక కల్యాణ మండపం నూతన కమిటీని సెప్టెంబరు ఎనిమిదో తేదీన ఎన్నుకుంటామన్నారు. అప్పటివరకు పాత కమిటీనే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగిరేకుల నాగార్జున, కందుల కోటేశ్వరరావు, వనపర్తి లక్ష్మీనారాయణ, దొంగరి వెంకటేశ్వర్లు, సుంకరి అజయ్‌కుమార్, అచ్చయ్య పాల్గొన్నారు.

'రజకుల కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలి'

హుజూర్‌నగర్, ఆగస్టు 4: రజకుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాసు కోరారు. ఆదివారం పట్టణంలో రజక సంఘ సమావేశం, లాండ్రీ షాప్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోబీ ఘాట్ల నిర్వహణ రజక వృత్తిదారులకే కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, వసతి గృహాల్లో, పోలీస్ హెడ్‌క్వార్టర్లలో రజక వృత్తి చేసుకునే వారికి అవకాశం కల్పించేలా ప్రభుత్వం జీఓ తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా లాండ్రీ షాప్ యూనియన్ అధ్యక్షుడిగా ఇందిరాల నర్సింహారావు, ప్రధానకార్యదర్శులుగా ఇందిరాల రాంబాబు, అల్వాల ఉపేందర్, 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోటయ్య, బ్రహ్మం, ఇందిరాల రామకృష్ణ, శ్రీను, సాయిబాబా పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌కు తాళం

నేరేడుచర్ల, ఆగస్టు 4: పట్టణంలోన్ని సులభ్ కాంప్లెక్స్‌కు ఎన్ఎస్పీ అధికారులు తాళం వేశారు. సులభ్ కాంప్లెక్స్‌లోని మరుగుదొడ్ల మలాన్ని కొన్నేళ్లుగా డ్రైనేజీ ద్వారా ఆర్-3 కాల్వలోకి వదులుతున్నారు. దీంతో పరిసర ప్రాంతాలు దుర్వాసన వస్తున్నాయని స్థానికులు, రైతులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. ఆర్-3 కాల్వలో చెత్తను తొలగిస్తుండగా దుర్వాసన వస్తుండడంతో ఎన్ఎస్పీ సిబ్బంది, అధికారుల ఆదేశానుసారం సులభ్ కాంప్లెక్స్‌కు తాళం వేశారు. సులభ్ కాంప్లెక్స్ నిర్వాహకులు ఆదివారం మధ్యాహ్నం తాళం తీసి నడుపుతుండగా గమనించిన రైతులు ఎన్ఎస్పీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమాచారం అందుకున్న మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి సులభ్ కాంప్లెక్స్‌కు వెంటనే తాళం వేయించారు. ఈ విషయమై మునిసిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డిని కోరగా సులభ్ కాంప్లెక్స్ సెప్టిక్ ట్యాంకును రెండేళ్ల నుంచి శుభ్రం చేయించలేదని, డ్రైనేజీ పైపు ద్వారా సాగర్ కాల్వలోకి మలాన్ని పంపుతున్నారని అన్నారు. మలాన్ని సాగర్ కాల్వలోకి వదలకుండా సెప్టిక్ ట్యాంకులోకి పంపితేనే అనుమతి ఇస్తాం.

క్రీడాకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 4: క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన చదరంగం పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఆదివారం జిల్లా కేంద్రంలోని వైట్‌హౌస్‌లో అభినందించి మాట్లాడారు. జిల్లా నుంచి ముగ్గురు అంతర్జాతీయ ఫీడ్ రేటెడ్ క్రీడాకారులుగా ఎదగడం హర్షనీయమన్నారు. జిల్లా క్రీడాకారులకు సాయం చేయడంతో పాటు అండగా ఉంటానన్నారు. అన్‌రేటెడ్ ప్రిన్సెస్ ఆఫ్ ది వరల్డ్ 2023 పోటీల్లో గెలుపొందిన దివ్యభవానిని, బెస్ట్ అంగేరిలో జరిగే ఒలంపియాడ్ 2024 చదరంగ పోటీల్లో పాల్గొనే బాలికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దామిడి రమేష్‌రెడ్డి, నల్లా సురేష్‌రెడ్డి, మల్లేశ్వర్‌రావు, అనిల్‌కుమార్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం

పెన్‌పహాడ్: కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని మాజీ మంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగులపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడెంకు చెందిన సంకరమద్ది నారమ్మ, మణెమ్మ, నారాయణ వీరమ్మ, ఎ.వెంకట్‌రెడ్డి, పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన కేశగాని లక్ష్మణ్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. నారాయణగూడెం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు నారాయణ రాఘవరెడ్డి అనారోగ్యంతో ఉండగా పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు తూముల భుజంగరావు, సురేష్‌రావు, నారాయణ ప్రవీణ్‌రెడ్డి, భూక్య శివనాయక్, మండలి జ్యోతిపిచ్చయ్య, నారాయణ కృష్ణారెడ్డి, జగ్గారెడ్డి, ఒగ్గు దేవయ్య, సుధీర్‌రెడ్డి, నగేష్, లింగారెడ్డి, నర్సిరెడ్డి సీతారాములు, సందీప్, గోపాల్, వెంకటయ్య పాల్గొన్నారు.

కోతుల బారి నుంచి పంటలు కాపాడాలి

నాగారం, ఆగస్టు 4: తుంగతుర్తి నియోజకవర్గంలో కోతుల బారి నుంచి పంటలను కాపాడాలని కాంగ్రెసు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్ కోరారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కోతుల బెడదను నివారించాలని నాగారం తహసీల్దార్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి గత నెలలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాశం యాదవరెడ్డి, గుంటకండ్ల ఆశోక్‌రెడ్డి, కడారి సోమయ్య, వేముల రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక ఎర్రజెండా: సీపీఐ

మఠంపల్లి, ఆగస్టు 4: ఎర్రజెండా త్యాగాలకు ప్రతీక అని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. మఠంపల్లి మండల కేంద్రంలో పార్టీ మండల స్థాయి నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో ఎ.పున్నయ్య, రామకృష్ణ, చాంద్ పాల్గొన్నారు.

ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సంతోష్‌నాయక్

తిరుమలగిరి, ఆగస్టు 4: బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మునిసిపాలిటీ పరిధిలోని నెల్లిబండతండాకు చెందిన దరావత్ సంతోష్ నాయక్‌ను నియమించారు. సంతోష్‌నాయక్‌కు నియామకపత్రాన్ని రాష్ట్ర ఎస్టీ మోర్చా చీఫ్ కల్యాణ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఆత్మకూర్(ఎస్), హుజూర్‌నగర్: ఆత్మకూర్(ఎస్) మండలంలోని కోటపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993-94పదో తరగతి విద్యార్థులు నెమ్మికల్ గ్రామంలో సమ్మేళనం నిర్వహించారు. అదేవిధంగా ది హుజూర్‌నగర్ రెసిడెన్షియల్ హైస్కూల్‌కు చెందిన 1999-2000పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ప్రసాద్, సైదులు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేట టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పు మాలలకు వ్యతిరేకమని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఎర్రమల్ల రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ తీర్పుపై రిట్ పిటిషన్ వేస్తామన్నారు. కార్యక్రమంలో రవి, కట్ల మురళి, సైదులు పాల్గొన్నారు.

● నల్లగొండ పార్లమెంట్ ఇన్‌చార్జిగా జిల్లా కేంద్రానికి చెందిన ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పల్లేటి లక్ష్మణ్‌మాదిగ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో లక్ష్మణ్‌మాదిగకు నియామకపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనలో ఎమ్మార్పీఎస్-టీఎస్ అనేక పోరాటాలు చేసిందన్నారు.

సూర్యాపేట టౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బహుజనులంతా ఐక్యంగా ఉంటేనే బహుజన రాజ్యాధికారం సాధ్యమని ధిక్కార స్వరం, విప్లవ రచయిత చుక్కా రామనర్సయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. త్వరలో 'నిప్పుల గన్న నేల.. సూర్యాపేట' అనే పాటను చిత్రీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పిడమర్తి శ్రీను, కల్యాణ్, ఉదయ్‌గౌడ్, భిక్షపతి, నవీన్, మహేష్, ఆకాష్, శివ, పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్: ఉపాధ్యాయుడు ఎర్రగొర్ల గంగయ్య మృతి బాధాకరమని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు లక్కపాల ప్రవీణ్ కుమార్ అన్నారు. పాలకవీడు జడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు గంగయ్య మృతదేహంపై పాలకీడు మండలం సజ్జాపురం గ్రామంలో పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో యూసుఫ్, ధర్మరాజు, బాలకృష్ణ, నాగరాజు, ప్రసాద్, అంజయ్య పాల్గొన్నారు.

● స్నేహితులు దినోత్సవాన్ని పురస్కరించుకుని స్నేహితుడి జ్ఞాపకార్థం అన్నదానం చేయడం అభినందనీయమని పబ్లిక్ క్లబ్ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ వద్ద వీర్లపాటి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు అబ్దుల్ రహీం, చంద్రశేఖర్, అయూబ్‌ఖాన్, సోమయ్య, మురళి పాల్గొన్నారు.

● ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ మారితే లోక్‌సభ, శాసన సభ సభ్యత్వం రద్దు చేయాలని సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన చర్చాగోష్టిలో ఆయన మాట్లాడారు. పార్టీలు నైతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్ రేపాక లింగయ్య, యోగానంద్, ఆనంద్‌భాస్కర్, షేక్ ఉమర్, అబ్దుల్ కరీం, వెంకట్‌యాదవ్, చామకూరి నర్సయ్య, నాగేందర్‌నాయక్, పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్): మండలంలోని నెమ్మికల్ శ్రీదండు మైసమ్మ ఆలయం నూతన కమిటీ సభ్యుల ఎంపిక కోసం నల్గొండలోని దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఈ నెల నాలుగో తేదీ నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కమిటీ ఈవో కుశలయ్య ఒక ప్రకటనలో కోరారు.

పెన్‌పహాడ్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మండలంలోని అనంతారం గ్రామంలో దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్, ప్రధాని మోదీ, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెమ్మాది నరేష్, బైరెడ్డి లక్ష్మమ్మ, మామిడి ప్రవీణ్ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: మండలంలోని గోపాలపురంలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నందు ప్రభుత్వం వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఆదుకోవాలని న్యాయవాది కాల్వ శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పొదిల ఏడుకొండలు కోరారు.

మఠంపల్లి: మిషన్ భగీరథ నీరు మండలంలోని రామచంద్రపురం తండా, భోజ్యతండా, భీమ్లాతండా, కృష్ణతండా, గుర్రంబోడుతండాలకు అందడంలేదని కాంగ్రెస్ నాయకుడు మాలోతు భీముడునాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంలో నిర్లక్ష్యం చూపిన వాటర్ గ్రిడ్ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

కోదాడ రూరల్: ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబు మాదిగ ఆధ్వర్యంలో మండంలోని చిమిర్యాల గ్రామంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంజీవ, జయరాజ్ బాణాల అబ్రహం, స్వామి, కందుకూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: విద్యారంగంలో శాశ్వత ప్రాతిపదికన రెగ్యులర్ పర్యవేక్షణ అధికారులను నియమించాలని టీపీటీఎఫ్ కోదాడ మండల శాఖ అధ్యక్షుడు బడుగుల సైదులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెగ్యులర్ ప్రాతిపదికన డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలను వెంటనే నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

కోదాడ రూరల్: కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. సూపరింటెండెంట్ చల్లా శ్రీను హుజూర్‌నగర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో మోతెలో పనిచేస్తున్న సూరయ్య డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. సీనియర్ అసిస్టెంట్ మోషన్‌బాబు మేళ్ల చెర్వుకు బదిలీ కాగా, అక్కడ పనిచేస్తున్న శశిధర్ కోదాడకు వచ్చారు. మరో సీనియర్ అసిస్టెంట్ పుష్పలత చిలుకూరుకు బదిలీ కాగా, ఆమె స్థానంలో చిలుకూరు నుంచి శైలజ కోదాడకు బదిలీపై వచ్చారు. జూనియర్ అసిస్టెంట్ శివ హుజూర్‌నగర్‌కు బదిలీ అయ్యారు. కొద్దిరోజుల్లో మరి కొంతమంది బదిలీ అయ్యే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

●సమాజ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కోదాడలోని ఎమ్మెస్ కళాశాల ఆవరణలో ఈ నెల ఆరో తేదీన నిర్వహించే ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కన్వీనర్ ఆర్ వెంకటేశ్వరరావు కోరారు. ఎమ్మెస్ కళాశాలలో సమాజ చైతన్య వేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కోకన్వీనర్‌గా బంగారు నాగమణి, సభ్యులుగా వక్కవంతుల నరసింహారావు డీఎస్ స్వామి, పి.గంగాధర్‌రావు, వి.మట్టారెడ్డి, ఎస్.నర్సిరెడ్డి, వి.అప్పిరెడ్డి, జూలూరు వీరభద్రం, మల్లయ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, సాయిలు రామనరసయ్య, పాల్గొన్నారు.

కోదాడ రూరల్: నవనామి సంవత్సర సౌజన్యంతో శాంతిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ చందా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విమలకుమారి, పీడీలు జనార్దన్‌రెడ్డి, కొండలు, పార్వతి, టీచర్లు పాల్గొన్నారు.

తుంగతుర్తి: తుంగతుర్తి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెలుగుపల్లి, అన్నారం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలకు వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో బస్ డిపో ఏర్పాటుపై స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్ డిపో సాధన సమితి కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కడెం లింగయ్య, మరో తొమ్మిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

● ఢిల్లీలో ఈ నెల ఏడో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించే మాలల సామాజిక చైతన్య దీక్షలను విజయవంతం చేయాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు గంట లక్ష్మణ్ కోరారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మాలల సంఘాల ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గంట సందీప్, యాకూబ్, మాణిక్యరావు, సాల్మన్ పాల్గొన్నారు.

తిరుమలగిరి రూరల్: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకుడు పేర్ల నాగయ్య అన్నారు. మండలంలోని గుండెపురి గ్రామంలో ఆయన మాట్లాడారు.